

కల్చరల్ ఫెస్ట్‌లో సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు

ఉత్సాహంగా మిలాంజ్-2024

బంజారాహిల్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.7 లోని మెరిడియన్ స్కూల్‌లో ఇంటర్ స్కూల్ కల్చరల్ కాంపిటేషన్ పోటీలు మిలాంజ్-2024 పేరుతో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో నగరంలోని 20 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సెన్సార్ బోర్డు సభ్యురాలు, రచయిత డాక్టర్ శ్రీలేఖ కోచెర్లకోట ముఖ్య అతిథిగా విచ్చేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఫౌండర్, మాజీ ఎంపీ బుట్టా రేణుక మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు వారిని ప్రోత్సహించేందుకు ప్రతియేటా తాము ఇంటర్ స్కూల్ పోటీలను నిర్వహిస్తున్నామని విద్యార్థుల్లోని భయాన్ని పోగొట్టేందుకు ఈ పోటీలు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ నిషిరాణా తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లలను సరఫరా చేసిన రైతులకు వెంటనే బిల్లులు చెల్లించాలి

● బొల్ల వెంకట్ ముదిరాజ్

పంజాగుట్ట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ మత్స్యశాఖ ద్వారా ఉచిత చేప పిల్లల సరఫరా టెండర్లలో పాల్గొని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేప పిల్లల సరఫరా చేసిన చేప పిల్లల ఉత్పత్తి రైతులకు బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ చేప పిల్లల ఉత్పత్తి రైతు, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బొల్ల వెంకట్ ముదిరాజ్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 2023-24 సంవత్సరానికి టెండర్‌లో పాల్గొని చేప పిల్లల సరఫరాను దక్కించుకున్నామని, గత సంవత్సరం ఆగస్టు నుంచి నవంబర్ నెలలో పంపిణీ పూర్తి చేశామన్నారు. చేప పిల్లల సరఫరా బిల్లులు జనవరిలో రావాల్సి ఉండగా ఇప్పటి వరకు రాక, అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. చేప పిల్లల పెంపకం కోసం అధిక వడ్డీలకు అప్పులు చేశామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి తమ రావాల్సిన బకాయిలు వెంటనే ఇప్పించి, తమను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కోడలితో గొడవపడి అత్త అదృశ్యం

బాలానగర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కోడలు, అత్త గొడవపడి అత్త ఇంటి నుంచి వెళ్లిపోయింది. సుందర్ శివకుమార్ అనే ఆటో డ్రైవర్ బాలానగర్ శోభనాకాలనీ రోడ్‌నెంబర్-2లో తల్లి సుందర్‌శాంతి(57) భార్యపిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. శనివారం ఉదయం సుందర్‌శాంతి శోభనాకాలనీ సాయిబాబ టెంపుల్ రోడ్డులో నివాసముండే ఐశ్వర్య (వరుసకు మనుమరాలు)ను కలిసేందుకు వెళ్లింది. ఇంటికి తిరిగి వచ్చిన శాంతితో ఆమె కోడలు ఐశ్వర్య గొడవపడింది. అలిగిన అత్త శాంతి ఆధార్ కార్డును వెంటతీసుకుని ఇంటినుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం ఆమె కుమారుడు సుందర్ శివకుమార్ బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



సుందర్‌శాంతి

ప్రకాశ్‌నగర్ ఫ్లై ఓవర్‌పై కారు దగ్ధం

బేగంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బేగంపేట ప్రకాశ్‌నగర్‌లోని పీఎన్‌టీ ఫ్లై ఓవర్‌పై శనివారం అర్ధరాత్రి ఓ కారు దగ్ధం అయింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... దమ్మాయిగూడకు చెందిన డి.రవీందర్ దంపతులు ఐటీ ఉద్యోగులు. శనివారం రాత్రి విధులు ముగించుకుని కారులో ఇంటికి వెళ్తుండగా బేగంపేటలోని ప్రకాశ్‌నగర్‌లోని పీఎన్‌టీ ఫ్లై ఓవర్ మీదకు రాగానే ఒక్కసారిగా కారు ఇంజన్ నుంచి పొగలు వచ్చాయి. దీంతో వారు కారు దిగి బానెట్ ఓపెన్ చేయగానే ఒక్క సారిగా మంటలు వ్యాపించాయి. ఇది గమనించిన రవీందర్ దంపతులు డయల్ 100కు ఫోన్ చేశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా కాలిపోయింది.



దగ్ధమవుతున్న కారు

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తానని మోసం

బంజారాహిల్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తానని ఓ వ్యక్తి నమ్మబలికి డబ్బు తీసుకొని మోసం చేశాడు. కృష్ణానగర్‌కు చెందిన ఎన్. సుజాత బుల్లి తెర సిరియల్స్‌లో హెయిర్ డ్రెస్సర్‌గా పనిచేస్తున్నారు. ఇదే పరిశ్రమలో ట్రాన్స్‌పోర్టులో పనిచేస్తున్న వెంకటగిరికి చెందిన ఎన్. శ్రీనివాస్ పరిచమయ్యాడు. తనకు ప్రభుత్వం విభాగంలో మంచి సత్సంబంధాలు ఉన్నాయని నమ్మబలికాడు. తన పలుకుబడితో డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తానని నమ్మబలికాడు. నమ్మిన ఆ మహిళ 2022 నుంచి 2023 వరకు రూ.6,52,535 రూపాయలు ఇచ్చింది. రోజులు గడుస్తున్నా డబుల్ బెడ్‌రూం రాలేదు. తన డబ్బులు తిరిగి ఇవ్వాలని శ్రీనివాస్‌ను పలుమార్లు అడిగినా పట్టించుకోవడంలేదు. దీంతో బాధితురాలు ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతిని బెదిరిస్తున్న వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): యువతిని చంపేస్తానని బెదిరిస్తున్న వ్యక్తిపై కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మహబూబ్‌నగర్‌కు చెందిన ఎం. సుజాత మూడేళ్ల క్రితం వెంకటగిరి హైలం కాలనీకి వచ్చి నివాసం ఉంటుంది. ఏడు సంవత్సరాల క్రితం కృష్ణ అనే వ్యక్తితో పరిచయం అయింది. ఇద్దరు కొద్ది కాలం ప్రేమించుకున్నారు. ఆ తరువాత విడిపోయారు. ఇటీవల సుజాత్‌కు ఫోన్ చేసిన కృష్ణ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఇంటికి వచ్చి చంపేస్తానని బెదిరించాడు. ఈ వ్యవహారంపై సుజాత కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు కృష్ణపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి వినియోగిస్తున్న ముగ్గురి అరెస్టు

బంజారాహిల్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశంలో గంజాయి వినియోగిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 63లో కొంత మంది గంజాయి వినియోగిస్తున్నట్లు ఎస్ఐ మెహర్ రాకేష్‌కు సమాచారం అందింది. వెంటనే ఆయన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా గురుబ్రహ్మానగర్‌కు చెందిన పత్లావత్ నవీన్, గంగర చింటు, జహీర్ సిద్దిఖీ గంజాయితో దొరికారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి

మాదాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ద్విచక్రవాహనాన్ని వేగంగా నడపడంతో అదుపు తప్పి వెనుకాల కూర్చున్న యువకుడు లారీకింద పడటంతో అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని అమలాపురంకు చెందిన ప్రవీణ్(25), అరిగాలి జైస్వామిశంకర్(24) సికింద్రాబాద్‌లోని పారడైజ్ ఐసీఐసీఐ బ్యాంక్‌లో ఇన్సూరెన్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తు కేపీహెచ్‌బీ రోడ్‌నెంబర్ 6లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 4న తెల్లవారు జామున 2 గంటల సమయంలో స్నేహితులను కలిసేందుకు ద్విచక్రవాహనంపై తన స్నేహితుడు జైస్వామిశంకర్‌ను తీసుకుని వేగంగా జేఎన్‌టీయే నుంచి మాదాపూర్ వైపు వెళ్తున్నారు. మాదాపూర్‌లో ఫ్లై ఓవర్‌పై దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో సడెన్ బ్రేక్ వేశాడు. వెనుకాల కూర్చున్న జైస్వామిశంకర్ బైక్‌పై నుంచి ఎగిరి అటుగా వెళ్తున్న లారీ చక్రాల కిందపడిపోయాడు. దీంతో అతని తలనుజ్జు నుజ్జయి అక్కడిక్కడే మృతిచెందాడు. ప్రవీణ్ గాయాలతో బయటపడ్డాడు. స్థానికుల సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



జైస్వామిశంకర్ (ఫైల్)

తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన వాక్

బంజారాహిల్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బ్రెస్ట్ ఫీడింగ్ పై అవగాహన తీసుకువచ్చేందుకు ఫెర్నాండెజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం బంజారాహిల్స్ కేబీఆర్ పార్కులో వాకథాన్‌ను నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆస్పత్రి ఉద్యోగులు మాట్లాడుతూ తల్లి పాలు ఇవ్వడం వల్ల తల్లి, బిడ్డ ఇద్దరికి మేలు జరుగుతుందన్నారు. అనంతరం ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెర్నాండెజ్ ఫౌండేషన్ సీనియర్ డాక్టర్ ప్రమోద్ శిశువుల ఆరోగ్యానికి, తల్లుల సాధికారతకు తల్లిపాలు ఎంతో కీలకమన్నారు. నియోనాటాలజీ విభాగం హెడ్ డాక్టర్ తేజోప్రతాప్ ఒలేటి మాట్లాడుతూ బ్రెస్ట్ ఫీడింగ్ పై తల్లుల్లో అవగాహన తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.



అవగాహన వాక్ అనంతరం ప్లకార్డులతో వైద్య సిబ్బంది

బహుజనుల కోసం పోరాడేది బీఎస్పీ

● బీఎస్పీ సెంట్రల్ కో ఆర్డినేటర్ అశోక్ సిద్ధార్థ్

ఖైరతాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బహుజనుల కోసం పోరాడేది బీఎస్పీ మాత్రమేనని బీఎస్పీ సెంట్రల్ కో ఆర్డినేటర్ అశోక్ సిద్ధార్థ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మైనార్టీలను మొన్నటి వరకు కాంగ్రెస్, ఇప్పుడు బీజేపీ, తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రాంతీయ పార్టీలు మోసం చేస్తూనే ఉన్నాయన్నారు. ఖైరతాబాద్ ఏసీ గార్డ్స్ బీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఏపీ, తెలంగాణలో పార్టీ, బహుజనుల రాజకీయ సామాజిక స్థితి గతులపై నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు కాన్షీరాం, మాయవతి ఎటువంటి పదవులు ఆశించకుండా కేవలం బహుజనుల శ్రేయస్సే లక్ష్యంగా కేంద్రంలో ప్రభుత్వానికి మద్దతు తెలిపారని, ఇది అణగారిన కులాల పట్ల వారి నిబద్ధతను తెలుపుతుందన్నారు. నేడు కులాల వారీగా చీలిన ప్రాంతీయ పార్టీలు, అటు మతవాదంతో బీజేపీ, ఇంకోవైపు కాంగ్రెస్‌తో ఒరిగేది ఏమీ లేదన్నారు. మొన్నటి ఎస్సీల ఉప వర్గీకరణ మీద సుప్రీంకోర్టు తీర్పుపై మాయావతి పార్టీ వైఖరిని స్పష్టం చేశారని, దీన్ని బీజేపీ రాజకీయంగా వాడుకుంటుందన్నారు. దీంతో తాము ఏకీభవించలేమని, అన్యాయాలు, అఘాయిత్యాలు అణిచివేత సమూహంగానే అనుభవించామన్నారు.

కార్యక్రమంలో రిటైర్డ్ డీపీజీ, బీఎస్పీ ఏపీ కో ఆర్డినేటర్ డా.పూర్ణచంద్రరావు, తెలుగు రాష్ట్రాల ఇతర కార్యవర్గ నిర్వాహక సభ్యులు, బడంగ్‌పేట డిప్యూటీ మేయర్ ఐ. శేఖర్, ఎం.బాలయ్య, నితిన్‌సింగ్, అశోక్ సిద్ధార్థ్, ఎల్.వందన కుమార్, ఎల్.రాజారావు పాల్గొన్నారు.



బీఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతున్న అశోక్ సిద్ధార్థ్

దోమల విజృంభణ

● రోగాల బారిన పడుతున్న ప్రజలు
● కాముని చెరువును కప్పేసిన గుర్రపు డెక్క
● నిద్రావస్థలో అధికారులు

అల్లాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని అనేక కాలనీలలో దోమల బెడద తీవ్రంగా ఉంది. డివిజన్‌కు చుట్టుపక్కల ఉన్న సున్నంచెరువు, మైసమ్మచెరువు, కాముని చెరువు ఉన్నాయి. ఈ చెరువుల చుట్టు పక్కల చెత్తాచెదారం, గుర్రపుడెక్క ఉండడంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. సాయంత్రం అయిందంటే దోమలు డివిజన్ పరిధిలోని పలు కాలనీలపై దాడి చేస్తూ ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. దోమ కాటుతో పలువురు వ్యాధులకు గురవుతున్నారు. చెరువుల్లో పరుచుకున్న గుర్రపుడెక్కతో దోమల అధికంగా పెరుగుతున్నాయని అధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఫలితంగా నిత్యం ప్రజలు దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముక్కు పిండి వేలకు వేలు ఆస్తి పన్ను కట్టించుకునే బల్దియా.. ప్రజల కనీస అవసరాలు తీర్చే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

దోమల సమస్యను వదిలేసి పరిసరాల పరిశుభ్రత పౌరుల బాధ్యత అంటూ అధికారులు తప్పించుకుంటున్నారని వాపోతున్నారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్, స్ప్రేయింగ్ కూడా చేయక పోవడం దారుణమని వాపోతున్నారు. సున్నంచెరువు పరిసర ప్రాంతాలైన గాయత్రి నగర్, జ్యోతినగర్, పద్మావతినగర్, మైసమ్మ చెరువు పరిసర కాలనీవాసులు రాజీవ్ గాంధీనగర్ కామునిచెరువు సమీప కాలనీలైన సఫ్దర్‌నగర్, వివేకానందనగర్, తులసినగర్‌లలో సాయంత్రమైతే దోమలు దండయాత్ర చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి దోమల నిర్మూలనకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గుర్రపుడెక్కతో నిండిన కాముని చెరువు

మనూలో జష్న్ ఏ ఆదాబ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మౌలానా ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో ఆదివారం జష్న్ ఏ ఆదాబ్ పేరుతో నిర్వహించిన సాహిత్యోత్సవం ఆహూతులను మైమరపింపజేసింది. సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, పర్యాటక మంత్రిత్వ శాఖ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో పద్మశ్రీ ప్రొఫెసర్ అశోక్ చక్రధర్, నటుడు అమిత్ సియాల్, ఫైసల్ మాలిక్, మానురిషి చద్దా, జాతీయ అవార్డు గ్రహీత, కూచిపూడి నృత్యకారిణి యామినీరెడ్డితో పాటు అనేక మంది కళాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మనూ వీసీ ప్రొ. ఐనుల్ హసన్, శాస్త్రవేత్త ప్రొఫెసర్ సయ్యద్ ఇ. హస్నేన్, తెలంగాణ జీఎస్టీ ప్రధాన కమిషనర్ సందీప్ ప్రకాష్, ఆదాయ పన్నుశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మితాలి మధుమిత, నవనీత్ సోనీ కున్వర్ రంజీత్‌సింగ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనూ వీసీ ప్రొఫెసర్ ఐనుల్ హసన్, అజ్మ్‌షాకిరీల ఆధ్వర్యంలో 'దెక్కనీ ఉర్దూ మే పార్సీ కే అస్రాత్'పై చర్చా కార్యక్రమం జరిగింది.



సాహిత్యోత్సవంలో ప్రదర్శన ఇచ్చిన కళాకారులు

మంగళంపల్లి బాలమురళీకృష్ణ సేవలు చిరస్మరణీయం

రాంనగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సంగీతానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన వ్యక్తి పద్మవిభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ అని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి అన్నారు. మానసికోల్లాసం, ఆనందంగా ఉండేందుకు సంగీతం దోహదపడుతుందన్నారు. జాతీయ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో రాగవర్ధిని కల్చరల్ సొసైటీ సౌజన్యంతో ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో పద్మవిభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ 94వ జయంతి కార్యక్రమం నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ.. సంగీతం మనసును తేలిక చేయడమే కాదు అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కోలుకునేలా చేస్తుందన్నారు. జాతీయ వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎల్.వి.చెన్నారావు మాట్లాడుతూ.. వాయిద్య కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి సహకారం అందించాలని కోరారు. సంగీత వ్యాప్తికి మంగళంపల్లి బాలమురళీకృష్ణ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేదర్ సందేశాన్ని ఫోన్ ద్వారా సమావేశంలో వినిపించారు. కార్యక్రమంలో అదనపు రవాణా రిటైర్డ్ కమిషనర్ సి.ఎల్.ఎన్. గాంధీ, ఆకాశవాణి ఆలిండియా హైదరాబాద్ స్టేషన్ డైరెక్టర్ విష్ణుభట్ల ఉదయ్‌శంకర్, తిరుపతి ఎస్వీ నాదస్వర పాఠశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ వి. సత్యనారాయణ, సాహితీవేత్త డాక్టర్ ఎం. ప్రభాకర్‌రావు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ రంగయ్య, వంశీ ఇంటర్నేషనల్ అధినేత డాక్టర్ వంశీ రామరాజు, జాతీయ వాయిద్య కళాకారుల సంఘం తెలంగాణ, ఏపీ అధ్యక్షులు కె. నర్సింహారావు, ఎల్. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుప్రసిద్ధ కర్ణాటక శాస్త్రీయ సంగీత విద్వాంసులు డి. వి. మోహనకృష్ణ ఆధ్వర్యంలో బాలమురళీ గాన రవళి సంగీత కార్యక్రమం నిర్వహించారు.

ప్రముఖ గాయకుడు వినోద్‌బాబు మధుర గీతాలను ఆలపించారు. అనంతరం నాదస్వర డోలు ఆంధ్రప్రదేశ్ విద్వాంసులచే కర్ణాటక సంగీత కచేరీ మృదుమధురంగా సాగింది.



మంగళంపల్లి బాలమురళీకృష్ణకు నివాళులర్పిస్తున్న జస్టిస్ రాధారాణి, ఎల్. వి. చెన్నారావు, డాక్టర్ రంగయ్య, డి. వి. మోహనకృష్ణ తదితరులు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

చందానగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా చందానగర్ ఫ్రెండ్స్‌కాలనీలో కార్పొరేటర్లు మంజులరెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్‌షిప్‌డే పురస్కరించుకుని మొక్కలు నాటడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి కాలనీలో పచ్చదనం పెంచి భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ప్రసాద్, వెంకటేష్, అక్బర్‌ఖాన్, గుడ్ల ధనలక్ష్మి, నరేందర్, వరలక్ష్మి, భవాని, కాలనీ అధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి నవీన్ పట్నాయక్‌తో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

ఓల్డుబోయినపల్లి: ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పర్యావరణ పరిరక్షణ సికింద్రాబాద్ విభాగం ప్రతినిధులు ప్రజలకు సూచించారు. ఆదివారం బోయినపల్లి గణేష్ మందిరంలో ఏర్పాటు చేసిన పర్యావరణ సంరక్షణ ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో 32 మందికి శిక్షణనిస్తూ కాలుష్య రహిత జీవనంపై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు కనీసం 10 మొక్కలైన నాటే విధంగా కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో ఎంత హాని ఉందో ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్డీవో దేవేందర్‌రెడ్డి, పర్యావరణ సంరక్షణ ప్రతినిధులు నన్నూరి రామిరెడ్డి, బ్రహ్మయ్య చౌదరి, సికింద్రాబాద్ విభాగం పర్యావరణ సంయోజక్ మల్లికార్జున్, పడాల రఘురామ పటేల్, విష్ణుమూర్తి, కేదార్ శంకర్, అశోక్, లైయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు కోల రవీందర్, శివశంకర్ పాల్గొన్నారు.



కాలనీవాసులతో కలిసి మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజులారెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్



మహేందర్ బాబు, మహేష్ యాదవ్‌లకు నియామక పత్రాలు అందజేస్తున్న పవన్

లష్కర్ సాధన సమితిలోకి మహేందర్, మహేష్

ఖైరతాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): లష్కర్ జిల్లా సాధన సమితి ఖైరతాబాద్ నియోజకవర్గం కన్వీనర్‌గా మహేందర్ బాబు, కో కన్వీనర్‌గా మహేష్ యాదవ్‌ను నియమించారు. ఆదివారం ఖైరతాబాద్‌లో జరిగిన సమావేశంలో నియామక పత్రాలను మహేందర్ బాబు, మహేష్ యాదవ్‌కు జిల్లా అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ లష్కర్ ప్రత్యేక జిల్లా ఏర్పాటయితే కలెక్టర్ కార్యాలయం, పోలీస్ కమిషనర్ కార్యాలయం జిల్లా కోర్టులు వస్తాయని, వాటితో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. సమితి ప్రధాన కార్యదర్శి బాలరాజు యాదవ్, జగదీష్ గౌడ్, సునీల్ ముదిరాజ్, శ్రీకాంత్ రెడ్డి, కృష్ణ ముదిరాజ్, అశోక్ చారి, అజీజ్ పాల్గొన్నారు.



ఖైరతాబాద్ గణపతి తయారీ కోసం సిద్ధంగా ఉన్న వరి పొట్టు

ఖైరతాబాద్ గణపతి తయారీకి వరిపొట్టు అందజేత

ఖైరతాబాద్ ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ గణపతి తయారీ కోసం యాదాద్రి భువనగిరి జిల్లా చీకటి మామిడి గ్రామానికి చెందిన తిరుమని భిక్షపతి గౌడ్ వరి పొట్టును ఉచితంగా అందజేశారు. భారీ గణపతికి భక్తితో తన పొలంలోని వరి పొట్టును ఉత్సవ కమిటీ కన్వీనర్ సందీపరాజ్‌కు అందజేశానని భిక్షపతి గౌడ్ తెలిపారు.



నియామక పత్రాన్ని చూపిస్తున్న గడ్డం శ్రీనివాస్ యాదవ్

అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్ష పదవిపై ఆరోపణలు తగవు

పంజాగుట్ట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా తనను మహాసభ జాతీయ అధ్యక్షుడు సెల్వం యాదవ్ నియమించారని మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభ జాతీయ అధ్యక్షుడు సెల్వం యాదవ్ చేతుల మీదుగా గత నెల 23న తాను నియామకపత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు. తమ సామాజిక వర్గం నుంచి ఎంపీలుగా గెలుపొందిన వారికి ఈ నెల 8న ఢిల్లీలో సన్మానం ఏర్పాటు చేశామని అన్నారు. యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరు అవుతారని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితుడిని అయిన తనపైన కొంత మంది ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. తన పదవిపై ఆక్షేపణలు ఉంటే జాతీయ నాయకత్వాన్ని సంప్రదించాలని, న్యాయస్థానాన్ని ఆశ్రయించినా తనకు అభ్యంతరం లేదని అన్నారు. అనవసర ఆరోపణలు చేస్తున్న వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో మహాసభ నాయకులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన లారీ

● ముగ్గురికి గాయాలు

జీడిమెట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీడిమెట్ల పారిశ్రామికవాడ గతి ట్రాన్స్‌పోర్టు వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నవీన్, భానుప్రసాద్, మోహన్ ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో సుభాష్‌నగర్ నుంచి సూరారం సాయిబాబానగర్‌కు కారులో వెళ్తున్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని గతి ట్రాన్స్‌పోర్టు వద్దకు రాగానే పీబీ 11 సీటీ 9677 నెంబర్ గల లారీ డ్రైవర్ రివర్స్‌లో వేగంగా వచ్చి కారు ముందు భాగాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో భానుప్రసాద్, మోహన్ తీవ్రంగా గాయపడ్డారు. నవీన్‌కు స్వల్పగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. జీడిమెట్ల పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. లారీని, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చంపేస్తామంటూ.. క్రికెటర్ మోహిత్‌కు బెదిరింపులు

● జూబ్లీహిల్స్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తనను చంపేస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని హైదరాబాద్ క్రికెటర్ టీఎస్ఆర్ మోహిత్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్‌లో ఉండే మోహిత్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తరఫున (హెచ్‌సీఏ) టోర్నమెంట్స్ ఆడుతుంటాడు. ఆల్‌రౌండర్‌గా పేరున్న మోహిత్‌కు జూలై 21న కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు మూడు నంబర్ల నుంచి ఫోన్ చేసి నిన్ను చంపేస్తామని బెదిరించారు. అంతటితో ఆగకుండా గతేడాది డిసెంబర్-20న నిన్ను చంపడానికి నీ ఇంటి సమీపానికి కారులో వచ్చామని, వరుసగా 13 సార్లు ఫోన్ చేసి, బెరించి వెళ్లామని గుర్తు చేశారు. డిసెంబర్-24 కారు టైర్లు కట్ చేసి, పంక్చర్ చేశామని పేర్కొన్నట్లు వెల్లడించారు. ఏడాది తిరిగేలోపు నిన్ను చంపేస్తామని తనను బెరించారని మోహిత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరీశ్వర్‌రెడ్డి తెలిపారు.



నిజామాబాద్ రైలులో సెల్‌ఫోన్ దొంగను అరెస్టు చేసిన ఆర్పీఎఫ్ పోలీసులు

నిజామాబాద్ రైలులో సెల్‌ఫోన్ దొంగ అరెస్టు, రిమాండు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో సెల్‌ఫోన్లను చోరీ చేస్తున్న దొంగను సికింద్రాబాద్ డివిజన్ నాగమ్మ శక్తి ఆర్పీఎఫ్ మహిళా కానిస్టేబుళ్లు పట్టుకున్నారు. బేగంపేట్ ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ - హైద్రాబాద్ వైపు వెళ్లే రైలులో ఓ వ్యక్తి ఇద్దరు ప్రయాణికుల వద్ద ఖరీదైన సెల్‌ఫోన్లను చోరీ చేశాడు. ఆ సమయంలో రైలులో చెకింగ్ చేస్తున్న సికింద్రాబాద్ డివిజన్ ఆర్పీఎఫ్ నాగమ్మ శక్తి మహిళా కానిస్టేబుళ్లకు సదరు వ్యక్తిని అనుమానించి జేబులో చెకింగ్ చేయగా రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు అడిగిన ప్రశ్నలకు పొంతన లేని సమాధానం ఇవ్వడంతో చోరీ చేసినట్లు విచారణలో వెల్లడైంది. వెంటనే నిందితుడి నుంచి ఖరీదైన రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



ప్రయాణికుడి బ్యాగును చోరీ చేసిన వ్యక్తిని అరెస్టు చేసిన ఆర్పీఎఫ్ పోలీసులు

రైలులో ప్రయాణికుడి బ్యాగ్ చోరీ

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌కు చేరుకున్న ఓ రైలులో పాంట్రీకార్ బోగీలో ప్రయాణికుడి బ్యాగ్‌ను దొంగిలించిన నిందితుడిని సికింద్రాబాద్ డివిజన్ ఆర్పీఎఫ్ శక్తి రుద్రమ్మ మహిళా కానిస్టేబుళ్లు పట్టుకున్నారు. బేగంపేట్ ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ నుంచి ఖాజీపేట్ వైపు వెళ్లే రైలులో పాంట్రీకార్ ఏసీ బోగీలో గుర్తు తెలియని వ్యక్తి ప్రయాణం చేస్తుండగా ఆ సమయంలో సికింద్రాబాద్ డివిజన్ ఆర్పీఎఫ్ శక్తి రుద్రమ్మ టీం మహిళా కానిస్టేబుళ్లు రాధశైనీ, జ్యోతిసికర్వార్‌లకు పాంట్రీకార్ బాయ్ సమాచారం ఇవ్వడంతో కానిస్టేబుళ్లు అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని పట్టుకుని ఈ బ్యాగు ఎక్కడిది అని విచారించగా, ప్రయాణికుల వద్ద నుంచి బ్యాగును దొంగిలించినట్లు అంగీకరించడంతో ఆ వ్యక్తిని ఆర్పీఎఫ్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బ్యాగును ప్రయాణికుడికి అప్పగించారు.

సిగరెట్ ఇవ్వలేదని స్నేహితుడిపై బ్లేడ్‌తో దాడి

అడ్డగుట్ట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సిగరెట్ అడిగితే ఇవ్వలేదని స్నేహితుడిని బ్లేడ్‌తో గాయపరిచిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజార్‌కు చెందిన కిరణ్ (21) మద్యానికి అలవాటు పడి జులాయిగా తిరుగుతూ ఏ పనిచేయకుండా ఉంటున్నాడు. దీనికి తోడు ప్రతి రోజూ గంజాయి తాగేవాడు. సెల్‌ఫోన్‌లకు టెంపర్ గ్లాస్ వ్యాపారం చేసే అనీష్, కిరణ్ ఇద్దరూస్నేహితులు. ఆదివారం మద్యం మత్తులో కిరణ్ స్నేహితుడు అనీష్ ఇంటికి వచ్చి సిగిరెట్ అడిగాడు. తన వద్ద సిగిరెట్ లేదని చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కిరణ్ తన జేబులో ఉన్న బ్లేడ్‌తో అనీష్ వీపుపై దాడి చేసి కనిపించకుండాపోయాడు. రక్తపు మడుగులో ఉన్న అనీష్‌ను స్థానికులు వెంటనే వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న గోపాలపురం పోలీసులు బ్లేడ్‌తో గాయపరిచిన కిరణ్‌ను ఎట్టకేలకు పట్టుకున్నారు. నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రకాశ్‌నగర్ ఫ్లై ఓవర్‌పై కారు దగ్ధం



దగ్ధమవుతున్న కారు

బేగంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బేగంపేట ప్రకాశ్‌నగర్‌లోని పీఎన్‌టీ ఫ్లై ఓవర్‌పై శనివారం అర్ధరాత్రి ఓ కారు దగ్ధం అయింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... దమ్మాయిగూడకు చెందిన డి.రవీందర్ దంపతులు ఐటీ ఉద్యోగులు. శనివారం రాత్రి విధులు ముగించుకుని కారులో ఇంటికి వెళ్తుండగా బేగంపేటలోని ప్రకాశ్‌నగర్‌లోని పీఎన్‌టీ ఫ్లై ఓవర్ మీదకు రాగానే ఒక్కసారిగా కారు ఇంజన్ నుంచి పొగలు వచ్చాయి. దీంతో వారు కారు దిగి బానెట్ ఓపెన్ చేయగానే ఒక్క సారిగా మంటలు వ్యాపించాయి. ఇది గమనించిన రవీందర్ దంపతులు డయల్ 100కు ఫోన్ చేశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా కాలిపోయింది.

మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

మల్కాజిగిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణ సాధించడమే కాదు.. వర్గీకరణ ఫలాలను ఎస్సీ కులాల్లోని అన్ని వర్గాలకు సమానంగా పంచడమే మందకృష్ణ మాదిగ లక్ష్యమని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ అన్నారు. ఆదివారం మల్కాజిగిరి చౌరస్తాలో మాదిగ సంక్షేమసంఘం నాయకులు నర్సింగ్ మాదిగ ఆధ్వర్యంలో సుప్రీం తీర్పును స్వాగతిస్తూ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి లక్ష్మణ్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వడ్డేపల్లి శివ, భైరుపాక శివ, నర్సింగరావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● 24 గంటల్లో నిందితుడిని అరెస్ట్ చేసిన అల్వాల్ పోలీసులు

అల్వాల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో దొంగతనం చేసిన వ్యక్తిని అల్వాల్ పోలీసులు 24 గంటలలోపు అరెస్టు చేశారు. అల్వాల్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరెడ్‌మేట్ మాధవినగర్‌కు చెందిన కుంచెపు శివ(26) భవన నిర్మాణ కూలీగా పనిచేస్తు జీవిస్తున్నాడు. శనివారం ఉదయం నేరేడ్‌మెట్ పీఎస్ పరిధిలో పార్కింగ్ చేసిన బైక్‌ను దొంగలించి మచ్చబొల్లారం కల్లు కంపౌండ్‌లో కల్లుతాగాడు. అనంతరం సమీపంలోని రుక్మిణి ఎన్‌క్లేవ్‌లో తాళం వేసిన ఇంటిని గమనించి ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లో ఉన్న వెండి అభరణాలు, రూ.2వేల నగదను దోచుకొని పారిపోయాడు. ఈ మేరకు కేసు విచారణ ప్రారంభించిన పోలీసులు ఆదివారం సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడి నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

దైవ దర్శనానికి వెళ్లి వచ్చేసరికి..

జవహర్‌నగర్, అగస్ట్ 4 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనం కోసం ఓ కుటుంబం ఊరికెళ్లడంతో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న బంగారం ఎత్తుకుపోయిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మాయిగూడా నర్సయ్య కాలనీలో నివాసం ఉంటున్న ఓడపల్లి కవిత, భర్త జితేందర్ వారి పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. డ్రైవర్‌గా పనిచేస్తున్న జితేందర్ తన కుటుంబసభ్యులతో కలసి ఈనెల 2న వేములవాడకు దైవ దర్శనం కోసం వెళ్లారు. శనివారం ఇంటికి చేరుకునే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. పడకగదిలోని బీరువాలో ఉన్న వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. అందులో ఉన్న 5 తులాల బంగారు ముత్యాల హారం కనిపించకపోవడంతో జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకుని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీగణేష్



అమ్మవారిని దర్శించుకున్న జంపన ప్రతాప్



ముత్యాలమ్మ, పోచమ్మ అమ్మవార్లని దర్శించుకుంటున్న కార్పొరేటర్ సామలహేమ తదితరులు

వైభవంగా దండుమారమ్మ

బోనాల జాతర



అమ్మవారికి బోనం సమర్పించడానికి వెళుతున్న యువతి

సికింద్రాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నూతన వస్త్రాలు ధరించి, నెత్తిన బోనాలతో తరలివచ్చిన మహిళలు, అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు, ఆకట్టుకున్న తొట్టెల ఊరేగింపు, ఆకర్షణీయంగా సాగిన ఫలహార బండ్ల ఊరేగింపు, ఆసక్తికరంగా సాగిన పోతరాజుల విన్యాసాలు.... కంటోన్మెంట్‌తోపాటు జంటనగరాల్లో ప్రసిద్ధి చెందిన బాలంరాయి దండుమారమ్మ బోనాల జాతర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి తెల్లవారుజాము నుంచే మహిళలు ఆలయానికి విచ్చేసి, అమ్మవారికి బోనాలు సమర్పించారు. తమకు, తమ కుటుంబ సభ్యులకు అంతా శుభం చేకూర్చాలంటూ మొక్కులు తీర్చుకున్నారు.

సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్, కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ, పాలకమండలి మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోయినపల్లి మార్కెట్ మాజీ చైర్మన్లు ముప్పిడి గోపాల్. టి.ఎన్.శ్రీనివాస్, మాజీ సభ్యుడు దేవులపల్లి శ్రీనివాస్, పీసీసీ కార్యదర్శి బి.ఎ.ప్రమోద్‌కుమార్, నాయకులు బి.సాయికిరణ్, నరేష్ ముదిరాజ్, దర్గారవి, శ్యామ్‌రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అరవింద్

ముత్యాలమ్మ పోచమ్మ ఆలయ బోనాలు

బౌద్ధనగర్ : సీతాఫల్‌మండి మేడిబావిలో ముత్యాలమ్మ, పోచమ్మ ఆలయంలో ఆదివారం బోనాల జాతర వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో బోనాలు ఎత్తుకుని అమ్మవార్లకి సమర్పించి ముత్యాలమ్మ, పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ పరికిబండ కళాప్రకాశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామలహేమ, టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్, బీజేపీ మహకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, లష్కర్ జిల్లా సాధనసమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సాదం బాలరాజ్‌యాదవ్, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, నాయకులు నోముల ప్రకాశ్‌రావు, రాచమల్ల సంగీత్, స్వామ్రాట్ మల్లికార్జున్, కొండల్ వేంకటేశ్వరరావు, బీజేపీ సికింద్రాబాద్ ఇన్‌చార్జి కందాడి నాగేశ్వరరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ కందినారాయణ, బిట్ల రఘునందన్, పొట్టి శ్రీను పోచమ్మ, ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు కళాప్రకాశ్‌తోపాటు పరికిబండ మోహన్, పలువురిని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ ఆధ్వర్యంలో ఆలయం వద్ద భారీగా బందోబస్తును ఏర్పాటుచేశారు. సోమవారం ఫలహారబండ్లు తొట్టెల ఉరేగింపుతో పాటు అదేరోజు ఆలయ ఆవరణలో రంగం కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మహేంద్రహిల్స్‌లో ..

మారేడుపల్లి : ఆషాఢమాసం బోనాల జాతరలో భాగంగా ఆదివారం మహేంద్రహిల్స్‌లోని శ్రీవనదుర్గ రాజరాజేశ్వరి చంద్రమౌళీశ్వర ఆలయంలో సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయ వేద పండితులు వేణుమాధవశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల జాతర ఉత్సవాల్లో కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జె.రామకృష్ణ, బి.ఎన్.శ్రీను, వేలాదిమంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



ముత్యాలమ్మ, పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయచైర్మన్ నోముల ప్రకాశ్‌రావు

అంబేడ్కర్ నగర్ బస్తీలో ..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రత్యేకంగా నిలుస్తుందని కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ఆషాఢ మాస బోనాల జాతరలో భాగంగా ఆదివారం ఈస్ట్ మారేడుపల్లిలోని అంబేడ్కర్‌నగర్ బస్తీలో శ్రీనల్లపోచమ్మ అమ్మవారికి శ్రీగణేష్ పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. బస్తీ పెద్దలు, ఆలయ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన బోనాల జాతర వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనం, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా పికెట్‌లోని శ్రీభగవతి, శ్రీముత్యాలమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే శ్రీగణేష్ దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బోనాల జాతరలో భాగంగా అమ్మవారికి సమర్పించిన ఒడిబియ్యాన్ని భక్తులకు అన్నప్రసాదం తయారుచేసి అందజేశారు.

బొల్లారంలో ..

తిరుమలగిరి : ఆషాఢ మాసం బోనాల జాతర మూడవ వారంలో భాగంగా బొల్లారంలోని డౌటన్ బజార్ భూలక్ష్మమ్మ దేవాలయంలో బోనాల జాతర వేడుకలు అంగరంగవైభవంగా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు మహిళలు, పురుషులు చిన్నారులతో కలిసి బోనాలు సమర్పించడంతో పాటు అమ్మవారికి సాకను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల జాతరతో బొల్లారం ఆద్యంతం ఆధ్యాత్మికత సంతరించుకుంది. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందించి ఆశీర్వాదాలు అందజేశారు.



బోనంతో యువతి



బోనాలు తీసుకువెళుతున్న యువతులు



బోనమెత్తిన యువత



బోనాలు తీసుకువస్తున్న ఆలయ కమిటీ కుటుంబసభ్యులు



ఆలయంలో మహిళల పూజలు



పోచమ్మ, ముత్యాలమ్మ బోనాల వేడుకల్లో గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ తదితరులు



ముత్యాలమ్మ, పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్



అమ్మవారిని దర్శించుకుంటున్న జె.రామకృష్ణ



వారాసిగూడ చౌరస్తాలో అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

బౌద్ధనగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అమావాస్యను పురస్కరించుకుని వారాసిగూడ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వారాసిగూడ చౌరస్తాలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు సుధాకర్, ప్రధానకార్యదర్శి బంధువుల రాజేశ్, కోశాధికారి మూల వీరశేఖర్, మాజీ అధ్యక్షులు గోపాల రమేష్, బెలిదే నరసింహారావు, అన్నదాతలు ఎలగంటి శివకుమార్, మారడుగు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బాడీ బిల్డింగ్ పోటీల నిర్వాహకుల సమావేశం

బాడీ బిల్డింగ్ పోటీలు

తిరుమలగిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సీకేఆర్ సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీలను నవంబర్ 9, 10 తేదీలలో నిర్వహించనున్నామని సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్ కాంపిటీషన్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరసింహన్ కన్నన్ తెలిపారు. ఆదివారం బొల్లారంలో ఏర్పాటు చేసిన సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్ కాంపిటీషన్ ఆర్గనైజింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణతో పాటు హైదరాబాద్ నగరానికి చెందిన మిస్టర్ అండ్ మిసెస్ 34వ పోటీలను నిర్వహిస్తున్నామని, ఇందులో పాల్గొని ప్రతిభను చాటాలని సూచించారు. దేహదారుఢ్యం యువతీ యువకులకు ఎంతో ముఖ్యం అని ఆయన అన్నారు. ఆరోగ్యంతోపాటు వివిధ ప్రభుత్వ శాఖలలో ఉపాధి కూడా లభిస్తుందని అన్నారు. సమావేశంలో సౌత్ ఇండియా బాడీ బిల్డర్ అసోసియేషన్ అధ్యక్షులు బెన్నీ ఫ్రాన్సిస్ కార్యదర్శి ఎం.ఎ.సలీమ్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నవీన్‌రాజ్ పాల్గొన్నారు.

మనూలో జష్న్ ఏ ఆదాబ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మౌలానా ఆజాద్ ఉర్దూ నేషనల్ యూనివర్సిటీలో ఆదివారం జష్న్ ఏ ఆదాబ్ పేరుతో నిర్వహించిన సాహిత్యోత్సవం ఆహూతులను మైమరపింపజేసింది. సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, పర్యాటక మంత్రిత్వ శాఖ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో పద్మశ్రీ ప్రొఫెసర్ అశోక్ చక్రధర్, నటుడు అమిత్ సియాల్, ఫైసల్ మాలిక్, మానురిషి చద్దా, జాతీయ అవార్డు గ్రహీత, కూచిపూడి నృత్యకారిణి యామినీరెడ్డితో పాటు అనేక మంది కళాకారులు పాల్గొన్నారు.





సాహిత్యోత్సవంలో ప్రదర్శన ఇచ్చిన కళాకారులు

ఈ కార్యక్రమంలో మనూ వీసీ ప్రొ.ఐనుల్ హసన్, శాస్త్రవేత్త ప్రొఫెసర్ సయ్యద్ ఇ.హుస్సేన్, తెలంగాణ జీఎస్టీ ప్రధాన కమిషనర్ సందీప్ ప్రకాష్, ఆదాయ పన్నుశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మితాలి మధుమిత, నవనీత్ సోనీ కున్వర్ రంజీత్‌సింగ్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనూ వీసీ ప్రొఫెసర్ ఐనుల్ హసన్, అజ్మీషా కిరీల ఆధ్వర్యంలో 'డెక్కనీ ఉర్దూ మే పార్సీ కే అస్రాత్'పై చర్చా కార్యక్రమం జరిగింది.